# సమూయేలు సమర్పణకు ఉదాహరణ

రోమా సామ్రాజ్యపు యుద్ధ విజయాల కాలంలో నియమితుడైన కొలొషియ ఏ షరత్తులు లేకుండానే లొంగిపోవలసినదిగా బలవంతం చేయబడింది. గవర్నరుగా నియమితుడైన ఎగేరియస్ కొలొషియన్ రాయబారులను యిలా అడిగాడు: "కొలొషియా జనులు తమ సొంత అధికారం క్రిందనే ఉన్నారా?" అందుకు అవునని జవాబు వచ్చినప్పుడు, "మిమ్మును, మీ గుడులను, మీ వస్తు సామాగ్రిని, సమస్త ఆస్తిని నా చేతికిని, రోమా ప్రజల అధికారికిని మీరు అప్పగిస్తారా?" అని అతడు తిరిగి అడిగాడు. "మేము సమస్తాన్ని లోబరచుతాము" అని వారు జవాబిచ్చారు. అందుకతడు, "నేను మిమ్మును అంగీక రించాను" అని తెలిపాడు. పాత నిబంధనలో సంపూర్ణంగా దేవునికి లోబరచుకున్న - సమూయేలు అను ఒక మనుష్యుని ఈ వివరణ జ్ఞాపకం చేస్తుంది.

పవిత్రత, నమ్మిక, నీతి అనేవాటికి ఎడతెగని రికార్డుగా సమూయేలు జీవితాన్ని మనం చదువుతాం. బాల్యంనుండి మరణంవరకు అతన్ని నడిపింది - ఘనమైన ఒకే గమ్యం. అతని జీవితానికి ఏ మచ్చలు లేవు, దుష్ట కార్యాలతో సంబంధం లేదు, చట్ట విరుద్ధమైన పనులు లేవు. అతడు ప్రజాజీవితం నుంచి విరమిస్తూ, ఏ ప్రజాధికారి కలలోనైనా తలవనంతటి ఆపదను తలదాల్చాడు - తాను చేసిన తప్పేమో తనకు తెలుపుమని అతడు ఇశ్రాయేలీయులను అడిగాడు! (12:2, 3). దానికి జవాబు మౌనమే! ఏ ఒక సంఘటన కూడా వేలెత్తి చూపేటట్టు లేదు. సమూయేలు చరిత్ర మచ్చ లేనిది.

సమూయేలు జీవితాన్ని సంగ్రహంగా పరిచర్యపట్ల అతని తత్వమెట్టిదో నిర్వచించ మంటే - సమర్పణ అని చెప్పవచ్చు. హన్నా గర్భంలో అతడు పడింది మొదలు తన చివరి ఊపిరిని అతడు పీల్చేవరకు, అతడు దేవునికి సమర్పితుడైన మనిషిగా ఉన్నాడు. అతని సమర్పణ తరతరములలోని జనులకు మాటలోను, క్రియలోను మెరుపుదాడిగా నిలిచింది.

## పసివారికి: ఆసక్తిగల సమర్పణ యొక్క సవాలైయుంది (2:11, 18-21; 3:1-21)

సమూయేలు ఆరంభ సంవత్సరాలు రెండు ప్రత్యేకమైన స్థలాల్లో గడిచాయి. మొదటిదిగా, రామాలో అతడు తన తల్లిదండ్రులతో ఉన్నాడు. అతడు తన తొలి మూడేండ్ల కాలం అక్కడ గడిపి ఉండవచ్చు. ఇంటివద్ద ఆదర్శాలు, ప్రార్థనలు, ప్రేమగల ఉపదేశాలచేత అతడు గాఢంగా ప్రభావితుడై ఉండొచ్చు. ఆరంభంలో అతనిలో నాటబడిన సూత్ర సంబంధమైన ముద్రలు దుష్టత్వంనుండి అతనిని తొలగించి, మేలైనవాటి వైపుకు అతనిని

నడిపించి ఉండవచ్చు. ఈ ఆరంభ సంవత్సరాల నుండి, అతడు యెహోవా దేవునికి ప్రతిష్ఠితుడన్న సంగతి సమూయేలు గ్రహించి ఉండవచ్చు. సమర్పణ అనే ఈ భావనను అతడు గ్రహించడం సులభ సాధ్యంగా ఉంటుంది. ఎందుకంటే అతనికి దాన్ని వివరించి ఉంటారు, – మాదిరిలోను, ఉపదేశంలోను వారు అతనికి దాన్ని ప్రదర్శించి ఉంటారు.

తన బాల్య సంవత్సరాలలోని రెండవ నివాస స్థలం షిలోహులోని ప్రత్యక్ష గుడారము. షిలోహులో ఇశ్రాయేలీయులు ఆరాధనకు సంబంధించి పరిశుద్ధ వస్తువులతో సమూయేలుకు అనుదినం సంబంధం ఉండేది. అక్కడ జరిగే పరిశుద్ధమైన ఆచరణలు క్రమబద్ధంగాను, స్థిరంగాను, తన తరువాత జీవితపు పరిచర్యలో మార్చబడినట్టుగాను అతని మల్చాయి.

ఈ క్రింది వివరాలనుండి సమూయేలు చేసిన యౌవన కాలపు సమర్పణలోని ఆతురత విదితమౌతుంది: యౌవన దశలో అతడు చెడు వలయాల నెరిగినవాడైనా దేవుని పట్ల విశ్వాసాన్ని నిలుపుకున్నాడు. అప్పటికి దాదాపు సమూయేలు పదిహేను సంవత్సరాల ఈడుగలవాడైయున్నట్టు తెలుస్తుంది (2:18; 3:1). తరచుగా యిది కలవరము కలిగించే, తిరుగుబాటు చేసే, ఒత్తిడికి లోనయ్యే, గుర్తింపు కొరకు చూచే వయస్సు; “గుంపును వెంబడించేలా” కొట్టుమిట్టాడే వయస్సు. ఈ తాకడులన్నిటిని ఎదుర్కొని దేవునియందు భక్తి నిలబెట్టుకున్న వాడుగా సమూయేలు ఉన్నాడు. బహు అపాయకరమైన ప్రభావాలలో సమూయేలు ఎదుర్కొన్నది ఏలీ కుమారులను. తమ దుష్ట కార్యాల్లో తమతో ఏకీభవించుమని హొఫ్నీ, ఫీనెహాసులు సమూయేలును ప్రోత్సహించారంటే సందేహించ నక్కర లేదు. అయితే సమూయేలు చలించలేదు. దేవునిపట్ల వారి విముఖత, అలక్ష్యం, తిరుగుబాటులో సమూయేలు పాలుపొంది ఉండేవాడే, కాని అతడలా చేయలేదు. ముందున్న యిద్దరు పెద్ద పిల్లల కామేచ్ఛలలో కలిసేలా సమూయేలు యువక దేహం అతని శోధించి యుండవచ్చు. అయితే సమూయేలు సమర్పణ కలిగినవాడుగనే ఉండిపోయాడు. దుష్టత్వపు ప్రభావాలు అతన్ని ఎదుర్కొన్నా, సమూయేలు మాత్రం నైతికంగాను ఆత్మ సంబంధంగాను బలంగా ఎదిగాడు (2:21; లూకా 1:80). హొఫ్నీ, ఫీనెహాసులకును సమూయేలుకును ఉన్న తారతమ్యం చూడు. వారు దాదాపు అదే వయస్కులవాళ్ళు. అయితే వారు బొత్తిగా వేరే విధంగా ఉన్నారు! (2:12, 18; 2:25, 26; 3:13, 19, 20). దానికి వివరణ ఏమి? యౌవనంలో కూడా సమూయేలు సమర్పణతో ఉన్నాడు! సమూయేలు దేవుని మాటలను ఆతురతగా వినే యువకుడు (3:10). సమూయేలు జీవితాన్ని ఒక వచనంలో సంగ్రహించాలంటే అది 3:10యే. అతని యౌవన చిహ్నాన్ని తెలిపే పదం ఏమిటంటే, “లోబడుట” అనేదే. దేవునియెడల అతనికి అమితమైన గౌరవం ఉంది. నిలిచియుండి వెంటనే లోబడ సిద్ధంగా ఉన్నవానిని సూచించేది “ఆలకించుట” అనే పదం. యువకులారా, ఈ పదం మిమ్మును వర్ణిస్తుందా? దేవునికి నీవు అర్పణము చేసినట్టయితే, నీవు ఆయన ఆజ్ఞను విన్నప్పుడు, లోబడడానికి వెనుకా ముందు ఆలోచించవు, వెంటనే లోబడడానికి యిష్టపడతావు (ప్రసంగి 12:1, 6).

అందరూ గౌరవించే యువకుడు సమూయేలు (2:26; 3:21; 4:1ఎ). అతడు

బాధ్యతలను స్వీకరించిన నవ యువకుడు (3:15). ప్రత్యక్ష గుడార ద్వారములు తెరవడం ముఖ్యమైన పనిగా ఉంటుంది. బాధ్యతగల అతని అలవాట్లనుబట్టి, దైవ జనుడుగా అతని కీర్తి విస్తరించింది. యువకులారా, మీరు ఈ సవాలును అంగీకరించి, మీ చుట్టునున్నవారు మిమ్మును గౌరవించునట్టు బాధ్యతగల మార్గాల్లో పయనించండి (సామె. 3:1, 4; 1 తిమోతి 4:12, 15; 5:22బి తో పోల్చి చూడు).

సమూయేలు జీవితం రామాలో ఆరంభమయ్యింది. తరువాత షిలోహుకు మారింది. అతని బాల్యము, నవ యౌవనము షిలోహునందు పరిచర్య చేయుటలో గడిచింది. అతడు పెద్దవాడయ్యాడు, అతని స్థితి భద్రంగా ఉంది (3:19-4:1), షిలోహులో తొలిగా వచ్చిన దర్శనం, ఇశ్రాయేలీయుల ఎదుట మాటి మాటికి అతని పలుకులు స్థిరంగా నిలిచియుండడం, బాధ్యతతో కూడిన అతని పద్ధతులు - తన ముందు జీవితానికి కావలసిన గౌరవాన్ని ధైర్యాన్ని ప్రసాదించాయి.

## వయస్సు వచ్చినవారికి: ఊగిసలాడిన సమర్పణ (7:1-17)

దేవుని ప్రవక్తగా స్థిరపరచబడిన తరువాత, షిలోహునుండి సమూయేలు వెళ్లిపోయినట్టు గోచరిస్తుంది. మందసం పట్టబడడంతో (4:11), షిలోహు ఫిలిష్తీయుల కైవశమైనట్టుంది (కీర్తన. 78:60నుండి). ఫిలిష్తీయుల అణచివేత క్రింద ఇశ్రాయేలీయులు తంటాలు పడ్డారు. సమూయేలు రామాలో ఉన్నట్టు పలు విధాలుగా వివరించబడింది. ఎల్కానానుండి భూ సంబంధమైన ఆస్తులు సమూయేలు పొందినట్టు కొందరంటారు. హొఫ్నీ ఫీనెహాసులచే షిలోహు ఆరాధన సంపూర్ణంగా చెడిపోవడంవల్ల సమూయేలు ఆ చోటును విడిచాడని యితరులు అంటూ ఉంటారు. ఏదియెలాగున్నా, రామా సమూయేలు పనికి కేంద్ర స్థానమై ఉంది.

ఇరవై ఏండ్లుగా మారుమనస్సు పొందుడని సమూయేలు ఆదేశిస్తూ ఇశ్రాయేలుగుండా రామానుండి వెళ్లుతూ ఉండేవాడు. సమూయేలు యొక్క విన్నపాలు 7:3లోని మాటల్లో సంగ్రహం అయ్యాయి. ఇరవైయేండ్లు బోధించిన పిమ్మట, మిస్పాలో ఇశ్రాయేలీయులను సమకూర్చి, దేశం యెహోవా వైపుకు మళ్లాలని అతడు వారికి ప్రకటించాడు. యౌవనం అంకురించే దశలో స్థిరమైన సమర్పణ సమూయేలుకు ఉన్నట్టు మిస్పా సమాజ కూడిక బయలుపరచుతోంది.

సమూయేలు జీవిత చరిత్రను చదవడంలో, ఈ క్రింది పాయింట్లను బట్టి వయస్సు వచ్చినవారు తమ్మును సమర్పించుకోవలసిందిగా సవాలు కలిగింది.

హృదయపూర్వకమైన మారుమనస్సుకు జనులను పిలవడంలో సమూయేలు భయపడలేదు (7:3). అపవిత్రతను అతడు ఖండించి, అన్యజనుల ఆచారాలనుండి ఇశ్రాయేలీయులు పూర్తిగా వేరు కావాలని అతడు పట్టుపట్టాడు. ఇశ్రాయేలు పాపం ఎంత ఘోరమైనదో ఎరిగి, దేవునియందు నమ్మిక ఉంచడంలోని ఆవశ్యకతను వారు గ్రహించాలని అతడు కోరాడు. పాపాన్ని సమూయేలు నిందించాడు, అతడు దానిని

ఎన్నడు మన్నించలేదు. సంపూర్ణమైన మారుమనస్సుకు అతడు వత్తి అడిగాడు! ఇశ్రాయేలు దేవునితో సమాధానపడాలని ప్రోత్సహించాడు (7:5). నీతిని ప్రేరేపించడానికి దేనినైనా చేయడానికి అతడు సిద్ధపడ్డాడు. అతడు ఇశ్రాయేలుతో విన్నవించుకున్నాడు, యాచించాడు, వాదించాడు.

తరువాత, అతడు అధికమైన గౌరవస్థానం చేరుకున్నాడు (7:6). తన పలుకుబడిని ఉపయోగించి సమూయేలు ఇశ్రాయేలును కలిసి రమ్మని పట్టుబట్టాడు. దేవుడిచ్చిన నియమాలకు తిరుగుబాటు చేసిన విషయంలో ఇశ్రాయేలు తన పాపాన్ని ఒప్పుకొంది. సమూయేలు ఇశ్రాయేలు మీద "న్యాయాధిపతిగా" నియమింపబడింది ఇక్కడే.

అతడు వారికి నాయకత్వాన్ని యిచ్చాడు (7:8). ఇశ్రాయేలుకు సహాయం అవసరమైనప్పుడు, తనను నడిపించగలవాని వైపు ఆమె చూచింది. సమూయేలు జీవితం, మాదిరి, ఉపదేశం అంతా కలసి అతన్ని గొప్ప నాయకునిగా నిర్ణయించింది.

సమూయేలు ప్రార్థనను ఉపయోగించి, దానిపై ఆధారపడ్డాడు (7:9). సమూయేలు యొక్క ప్రార్థనా బలం ఇశ్రాయేలు అంతటా తెలియబడింది. సమూయేలు ప్రార్థనలయందు జనులు నమ్మికయుంచారు. దేవుడు సమూయేలు యొక్క విన్నపాలు విని బదులు యిస్తూ ఉండేవాడు. దేవునికి ప్రార్థించినవారిలో సమూయేలు ముఖ్యుడై ఉన్న స్థానాన్ని కీర్తన 99:6లో గుర్తించడం ఆసక్తికరంగా ఉంటుంది. ఇశ్రాయేలు కోసం సమూయేలు చేసిన అభ్యర్థనలలో అతని ప్రార్థనా బలాన్ని యిర్మీయా15:1 సూచిస్తుంది. వారి విడుదల కొరకు సమూయేలు ప్రార్థించినట్టున్నూ, అతని ప్రార్థనలు వారికి జయము కూర్చినట్టున్నూ ఇశ్రాయేలీయులందరికి తెలుసు (7:8; 8:6). సమూయేలు సైన్యాధిపతియో, యుద్ధ శూరుడో లేక సైనిక చాతుర్యంగలవాడో కాడు. అతడు ఆయుధాలను యివ్వలేడు గాని, అతడు ప్రార్థించగలడు. వారి యుద్ధాన్ని గెలిపించింది అదే! (7:10, 11).

ఇశ్రాయేలు దేవునిపై ఆధారపడాలన్న సంగతిని అతడు వారికి ఎల్లప్పుడు జ్ఞాపకం చేస్తూనే ఉండేవాడు (7:12). దేవుని శక్తినిబట్టి మాత్రమే ఇశ్రాయేలు ఉనికిలో ఉందనే విషయాన్ని అతడు ఎల్లప్పుడును నొక్కి చెప్పాడు!

సమూయేలు సమాధానము, ఐకమత్యము, ఆశీర్వాదానికి హేతువైయున్నాడు (7:13, 14). అతని ఉపదేశాన్ని బట్టియే, గోత్రముల మధ్య నెలకొన్న అసూయలు అంతరించాయి. విభజించిన దేశం ఏకమయ్యింది. ఈ విధంగా ఇశ్రాయేలు "ఐక్య రాజ్యానికి" అతడు నాంది పలికాడు.

చివరిగా, దేవుని చిత్తాన్ని ఉపదేశించడంలో అతడు మునిగియున్నాడు (7:16). ఇశ్రాయేలు దేవునికి నమ్మకంగా నిలిచియుండాలంటే, దేవుని వాక్యాన్ని అది తెలిసికోవాలని అతడు ఎరిగియున్నాడు. ఇశ్రాయేలులో సందేశం విస్తరించడానికి "ప్రవక్తల పాఠశాల"ను సమూయేలు స్వంతగా ఆరంభించాడు (19:3-5, 23, 24; 2 రాజులు 2).

ఈ విధంగా కుర్ర వయస్సులోని ఉత్సాహం, పటుత్వం తగ్గిపోయినప్పుడు కూడా, సమూయేలు యొక్క సమర్పణ తన ప్రౌఢ కాలంలో కూడా ఆలాగే ఉన్నట్టుంది. అనేక సమస్యలు ఎదుర్కొనడంతో, సమూయేలు పటుత్వం తగ్గదే. ఇశ్రాయేలును మిస్పాలో కూడ్చుడానికి ఇరవై సంవత్సరాలు ఉపదేశింపవలసి వచ్చింది. అయితే సమూయేలు

జంకలేదు. భయము, ఒత్తిడి, పాపంతో పోరాడుతున్న పెద్దవారు సమూయేలువైపు చూచి అతనిలా స్థిరంగా ఉండాలి. పెద్దవారు తమ జీవితాల్లో ఈలాటి సంకల్పాన్ని ప్రదర్శింపవలసి ఉంటారు.

## వృద్ధులైన పరిశుద్ధులకు: సంతృప్తిపొందిన సమర్పణ యొక్క సవాలు

## (8:1-22; 9:6, 15-10:1, 17-25; 12:1-7, 19-25)

సమూయేలు వృద్ధ వయస్సుకు చేరుకున్నా, అతని సమర్పణలోను, కదలని అతని బాధ్యతలలోను ఏవి తగ్గలేదు. ఈ ముగింపు సంవత్సరాల కాలంలోనే అతని జీవితాన్ని వెనుకకు తిరిగి చూడడంలో గల తృప్తిని గూర్చి పాఠాలు కనుగొనవచ్చు. కొందరు తాము జీవించిన కాలాన్ని వెనుక తట్టుకు తిరిగి దుఃఖంతో వెడలిపోతారు, అయితే సమూయేలుది అలాటి జీవితం కాదు. సమూయేలు జీవితం వ్యర్థంగా గడపలేదు. వెనుకకు తిరిగి చూచుకొనడంలో ఆదరణతో కూడిన సంతృప్తిని అతడు కలిగియున్నాడు.

మొదటిగా, తన జీవితమంతటిలో సమూయేలు దేవునియందు భక్తిగలవాడై యున్నందున అతడు సంతృప్తిచెందాడు. తప్పు ఒప్పుల మధ్య వ్యత్యాసాన్ని తన జీవితంలో ఎల్లప్పుడు అతడు ప్రదర్శించాడు (8:1–15). సమూయేలుపై తప్పుగా చెప్పగలిగింది ఏదైనా ఉంటే, అది అతని కుమారులను గూర్చినదియే. అయితే ఏలీవలె అతడు దోషారోపణ చేయబడలేదు (2:29; 3:13). అప్పుడు జీవించినవారు సహితము తగని పెంపకమనిగాని, తమ కుమారుల తప్పు కార్యములను చూడక విడిచిపెట్టినవాడు కాదు (12:2). సమూయేలు తన కుమారులను బహిరంగపు కార్యభారంనుంచి తొలిగించినట్టు చెప్పుతారు. తక్కినవాటిలో యిది ఒకటియట. పెద్దలు తన వద్దకు వచ్చినప్పుడు, వారు సమూయేలు నిజాయితీని ప్రశ్నించలేదు. వారు స్వేచ్ఛగా అంకితభావాన్ని ఒప్పుకున్నారు. కొందరు ముసలి వయసులో ఎన్నో సంవత్సరాలుగా నిలుపుకున్న విలువలను సడలిస్తారు, విమర్శలలో పాలు తగ్గి తప్పును మన్నిస్తారు. ముఖ్యంగా దగ్గర కుటుంబ సభ్యుల విషయంలో ఇది జరుగుతుంది. అయితే సమూయేలు విషయంలో అలాటిది లేదు! అతడు స్థిరంగా నిలబడ్డాడు (కీర్తన. 92:12–15; హోషేయ 12:6; హెబ్రీ. 10:23).

రెండవది, దేవుడైన యెహోవాను గూర్చిన అతని కోర్కె యింకా తీవ్రంగానే ఉన్నందున సమూయేలు సంతుష్టిగా ఉన్నాడు (8:6). విగ్రహారాధన చేసే తమ పొరుగువారిలా ఉండాలనే ఇశ్రాయేలు నిజమైన కోర్కె, తమకు రాజు కావాలనే విషయంలో వంచించబడింది. సమూయేలు దృష్టికి వారి కోర్కె "ప్రతికూలంగా" ఉంది. ప్రతికూలం అనే ఈ పదం – గాయపరచబడిన భావాలు, కోపావేశము, అని అర్థమిచ్చే హెబ్రీ పదంనుండి వచ్చింది. సమూయేలు ఆ కోర్కెను విన్నప్పుడు, కోపావేశం పొందాడు. అతడు వృద్ధుడైనందుకో లేక అతని కుమారులమీద ఉంచబడ్డ నేరాలకో అతనికి కోపం రాలేదు, కాని ఇశ్రాయేలు దేవుని నిరాకరించినందుకే! 1 సమూ. 10:17–25 సమూయేలు

గాఢంగా బాధింపబడిన సంగతిని తెలియజేస్తుంది. భయంకరమైన వ్యతిరేకతను ఎదుర్కొని సమూయేలు దేవుని ఘనత కొరకు నిలిచాడు. అతని వయస్సు మౌనంగా ఉండేలా చేయలేదు. అతని అత్యాసక్తిని తగ్గించి అది అతనిని నిరాశపరచలేదు. సర్వశక్తుడగు దేవుని పక్షంగా అత్యాసక్తితో ప్రయాసపడునప్పటికంటె, సమర్పణ మరి ఎన్నడును అంత మధురంగా ఉండదు (కీర్తన. 71:9; ఫిలేమోను 9).

మూడవది, తన జీవిత చరిత్రను అనుసరించి సమూయేలు సంతృప్తి చెందాడు (9:6). అతని పేరు అభిమానాన్ని, నమ్మకాన్ని కలిగించింది. అతడు దైవజనుడుగా గుర్తింపబడ్డాడు. అతని తొలి దినాల్లో అతడు జీవించిన విధానాన్ని బట్టి, అతని తరువాత దినాలు గొప్ప ఘనతను అతనికి తెచ్చిపెట్టాయి. మనమందరం పొందడానికి రమ్యమైన కాంప్లిమెంట్ యిక్కడ ఒకటుంది. మన ముసలితనంలో ప్రయాసపడే అధిక గౌరవాన్ని మనం పొందగలమా? (1 దినవృ. 29:28; సామె. 16:31).

నాల్గవది, సందేహపడువారిని సమూయేలు ప్రోత్సహించి, దేవుని సేవించడంలో వారిలో దాగియున్న శక్తిని తెలుసుకునేలా చేసాడు (9:20, 21) సమూయేలు దాదాపు 70 సంవత్సరాలు ప్రయాసపడి ఇశ్రాయేలును దేవుని సేవకుగాను వెనుకకులాగి దేవుడు రాజుగా వారికి కలడని నమ్మించాడు. ఇప్పుడు అతడు తన మార్గాన్ని నిలిపి వేరే మార్గంలో వెళ్లవలసినవాడైయున్నాడు! అది అతని నిర్ణయానికి వ్యతిరేకమయ్యింది. అతడు వృద్ధుడును, తన మార్గాలలో స్థిరపడినవాడైయున్నాడు. అతి శ్రేష్ఠమైన మార్గమేదో అతనికి తెలుసున నడంలో ఎలాంటి సందేహమూ లేదు, అయినా అతడు మార్చుకోవలసి వచ్చింది! (8:22). క్రొత్త రాజరికాన్ని సమర్ధవంతంగా పెంపొంద చేయడానికి సమూయేలు అధికంగా సమర్పించుకున్నాడు. ఈ కార్యమే సమూయేలును ఖ్యాతికెక్కిన నిజమైన కథానాయకునిగా చేసింది! అతడు సౌలును తీసికొని, ప్రోత్సహించి, నడిపించి, సలహాయిచ్చి నిలబెట్టాడు. సౌలును గొప్ప రాజుగా తీర్చి దిద్దింది సమూయేలే. మనం మన హక్కులు వదలుకోవలసి వచ్చినప్పుడు, మన ఆలోచనకు వ్యతిరేకంగా దానిలోనుండి తప్పుకోవలసి వచ్చినప్పుడు, సాధారణంగా ఏమి జరుగుతుంది? మార్పుకు వ్యతిరేకించి మనం పోరాడతాం. ఒకవేళ అనుమతించినా, గొణుగుతూ యిష్టం లేకుండా చేస్తాం. ఈలాటి పరిస్థితులు మనం ఎదుర్కొన్నప్పుడు, వృద్ధాప్యంలో సమూయేలు యొక్క సంతుష్టిని, మార్పును జ్ఞాపకం చేసికొని అన్ని విషయాల్లో దేవుని ప్రజలకు సహాయపడు! (1 కొరింథీ. 9:19-23; అపొ. 10:14). అది విధేయుడైన పరిశుద్ధుని యొక్క లక్షణం (ఫిలిప్పీ. 2:3, 4).

అయిదవది, తన జీవితమంతా దేవుని సేవలో గడిపినందుకు ఏ విధమైన దుఃఖం లేదు గనుక సమూయేలు సంతృప్తిగలవాడైయున్నాడు. 1 సమూ. 12:1-7లో, సమూయేలు తన గత జీవితాన్ని జ్ఞాపకం చేసికొన్నాడు. అక్కడ హాజరైనవారందరికి ఆ విషయాలు తెలుసు (12:2బి). అతని జీవిత క్రమం మచ్చలేనిది, అది దేవుని ఘనపరచింది. దానికి వ్యతిరేకంగా దేనిని యిప్పుడు అతడు బూనుకోలేదు. తన గత జీవితాన్ని తిరిగి చూచిన తరువాత దిద్దుబాటు అవసరం లేని స్థితిలో ఉండడం ఎంత ధన్యమైన విషయం! ప్రభువునకు సమర్పణతో కూడిన బ్రదుకు యొక్క ధన్యకరమగు సత్ ఫలితమది (2 తిమోతి 4:6, 7).

## మరణమందు: బహుమానం పొందిన సమర్పణ యొక్క సవాలు (25:1; 28:12-19)

సమూయేలు మరణం, అతను లేని లోటు తీర్చలేనిది. అతని జీవితం మహా గొప్ప ప్రభావాన్ని చూపింది. "ఇశ్రాయేలీయులందరు" కూడుకొని విలపించారు (1 సమూ. 25:1; ఆది. 15:15).

సమూయేలు మరణంలోని ఈ వాస్తవాలు సౌలు ఏన్దోరులో కర్ణ పిశాచిని దర్శించినప్పుడు బయటపడ్డాయి (28:12–19): అతడు తన విశ్రాంతిని "అనుభవిస్తున్నాడు" (28:15); అతని స్మృతి గౌరవ మర్యాదలను చూరగొంది (28:15బి); మరియు మరణానంతరం సహా సమూయేలు సమర్పణనే కోరుకున్నాడు (28:18, 19).

సమూయేలువలె మృతులు సజీవులతో సంభాషించడం అసాధ్యం, కాని సమూయేలు వలె జీవిస్తే వారి గమ్యాన్ని గురించి మనం నిర్ధారించవచ్చు. దేవునికి సమర్పణతో కూడిన జీవితాన్ని జీవించినట్లయితే, ఈ లోకాన్ని విడిచి వెళ్లేవారు ప్రశాంతమైన విశ్రాంతిని అనుభవిస్తారు (ప్రకటన 14:13). విశ్వాసులైన లేక నమ్మకస్థులైనవారి జ్ఞాపకాలు గౌరవాన్ని, మర్యాదను పొందుతాయి (హెబ్రీ. 12:1; 13:7). తమ జీవిత కథల ద్వారా మరణించిన పరిశుద్ధులు దేవునికి అర్పితమై ఉండాలని మనకు నిదర్శనం చూపుతారు.

## ముగింపు

సమూయేలును గూర్చి నీవేమనుకుంటావ్? అతని జీవితం అందమైనది. బాలుడుగా, దేవుని సేవించడానికి అతడు తన్ను తాను సత్వరంగా సమర్పించుకున్నాడు. వయస్సు వచ్చినవాడుగా, సత్యాన్ని నిలబెట్టి, దోషాన్ని ఎత్తి చూపడానికిని, ఇశ్రాయేలును దేవునివైపు నడిపించడానికిని, చలించక తనను తాను సమర్పించుకున్నాడు. వృద్ధ పౌరునిగా, వయసుతోబాటు వచ్చిన నెరసిన వెండ్రుకలతో … అనుభవం వచ్చి సంతుష్టి చెందాడ … వీడివెళ్ళిన పరిశుద్ధునిగా విశ్రాంతి, గౌరవం, సదాశయాల ఫలాలుగా పురస్కారం పొందాడు.

అతని సమర్పణ సమూయేలును నిర్దోషిగా, పవిత్రుడుగా, తన సమకాలికులందరిలో ఘనుడుగా నిలబెట్టింది. ఇశ్రాయేలు సమాజానికి అతడు యిచ్చినది పరిశుద్ధతతో కూడిన శీలం. ఇశ్రాయేలు యొక్క నైతిక పతనాన్ని అది అరికట్టింది. మరియు రాజైన దావీదు ద్వారా మెస్సీయ వచ్చునట్టు అది పునాది వేసింది. నీవు జీవితపు సమయ రేఖమీద ఎక్కడ నిలిచి ఉన్నా, నీ జీవితాన్ని దేవునికి సమర్పించుకోమని సమూయేలు జీవిత పద్ధతి మనకు తెలుపుతుంది (12:24). శిశువు యొక్క ఊయలనుండి వృద్ధుడగు పరిశుద్ధుని సమాధివరకు, దేవుని కొరకైన సమర్పణ ఎల్లవేళల శ్రేష్ఠమైన ప్రతిఫలం పొందుతుంది! (యెషయా 46:3, 4).

యూదులకు తమ గొర్రెలలో పదవ దానిని ఏరి తీసికొనడం ఒక ఆచారం. గొర్రెలను ఆడవాటినుండి వేరుచేసి, గొర్రెల దొడ్డిలో ఉంచి వాటికి ఒకే చిన్న ద్వారం ఏర్పాటు

చేస్తారు. ఆడవి ద్వారం వద్ద నిలిచియుంటాయి. రంగులో ముంచబడిన కర్ర చేతపట్టుకొనిన ఒక మనిషి ద్వారం వద్ద నిలిచి, ప్రతి పదియవ గొర్రె పిల్లను ఆ కర్రతో తాకి "దీనిని పరిశుద్ధముగా ఉండనిమ్ము" అంటూ దానికి గురుతు వేస్తాడు. ఈలాటి పోలికనే యెహెజ్కేలు ఉపయోగిస్తాడు. "గోవులలోనేగాని గొఱ్ఱె మేకలలోనేగాని, కోలక్రింద నడచునన్నిటిలో దశమభాగము ప్రతిష్ఠించుము" అది యెహోవాకు ప్రతిష్ఠితమగును (లేవీ. 27:32; యిర్మీయా 33:13 పోల్చి చూడు). కోల క్రింద అవి నడుచునవై సమూయేలు వలె అవి – "పరిశుద్ధమైనవి."